క్లుప్తంగా

ముగిసిన సరమ్మ ఉత్సవాలు

లింగపాలెం: మండల కేంద్రంలో వేంచేసి యున్న సరమ్మ పేరంటాళ్ల మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ ఉత్సవాలు 11 రోజుల పాటు అంగరంగా వైభవంగా నిర్వహించారు. కష్ణా, ఖమ్మం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ఉత్సవాలను తిలకించారు. ప్రతి రోజూ పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆఖరి రోజు శుక్రవారం దాతల సహకారం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ధర్మాజీగూడెం ఎస్సై వెంకన్న ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉన్నత ఆలోచనలతో చదవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ

పోలవరం రూరల్: విద్యార్థులు క్రమ శిక్షణ, ఉన్నత ఆలోచనలతో విద్యను అభ్యసించాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం గ్రామంలోని విజ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల 38వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏలూరు జైళ్ల శాఖ డీఎస్పీ సీహెచ్ఆర్వీ స్వామి, ఎ.వెంకట గంగాధర్ కుమార్, నోరి సోమయాజులు, బి.నారాయణరావు, ఎస్.సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

సునీత విలియమ్స్‌కు అభినందనలు


సునీత విలియమ్స్ అభినందన సభలో పాల్గొన్న ముస్లిం సోదరులు

కామవరపుకోట: అంతరిక్షం నుంచి పరిశోధనలు ముగించుకొని 9 నెలల పాటు అంతరిక్షంలో ఉండి భూమి మీదకు అడుగు పెట్టిన సందర్భంగా స్థానిక కామవరపుకోట కొత్తూరు జామియా మసీద్ ముస్లిం సేవా సంఘ కమిటీ ఆధ్వర్యంలో వ్యోమగామి సునీత విలియమ్స్‌కు అభినందనలు తెలిపారు. నేటి తరం మహిళలు సునీత విలియమ్స్‌ను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సంఘ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ పెద్దలు షేక్ ఇబ్రహీం, లాల్ జాన్, నూర్ ఖాన్, యూసఫ్, బాబ్ జాన్, ఖన్నా, చాన్ బాషా, కరీముల్లాహ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సామాజిక హక్కుల గౌరవ అధ్యక్షుడు టీవీఎస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి


సమావేశంలో పాల్గొన్న అధికారులు, జెడ్పీటీసీ సభ్యుడు కడిమి రమేష్

కామవరపుకోట: గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కడిమి రమేష్ మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజా నాగ సరస్వతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీడీవో ఎం.సరళకుమారి, తహసీల్దార్ జి.ఎలీషా, కామవరపుకోట మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

రెగ్యులైజేషన్ స్కీం వినియోగించుకోండి

కామవరపుకోట: ప్రభుత్వం ప్రకటించిన ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీం ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవవాలని మండల తహసీల్దార్ జి.ఎలీషా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీం 2025 ద్వారా మండలంలో ప్రభుత్వ భూముల్లో అక్టోబర్ 2019వ సంవత్సరానికి ముందు నివాస గృహాలు నిర్మించుకుని నివాసం ఉంటున్న అర్హులైన లబ్ధిదారులు సదరు స్థలాన్ని క్రమబద్ధీకరించుకునేందుకు ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 150 చదరపు గజాల స్థలం వరకు ప్రభుత్వం ఉచితంగా క్రమబద్ధీకరిస్తుందని, ఆ పైన భూమికి ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ఫీజు ఉంటుందని ఆయన తెలిపారు. అలాగే ప్రత్యేకంగా మహిళల పేరుపై భూమి హక్కులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు.


వేతనాలు రాక.. పూట గడవక..

- ఎనిమిది నెలల వేతన బకాయిలు చెల్లించాలి
- నారా లోకేష్ హామీ నిలబెట్టుకోవాలి

కొయ్యలగూడెం: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సత్యసాయి తాగునీటి కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. 8 నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్మికులు పేర్కొంటున్నారు. దాదాపు రూ.1.20 కోట్ల జీతాలను కార్మికులకు చెల్లించాల్సి ఉందన్నారు. సత్యసాయి తాగునీటి సరఫరా పథకంలో నూట ఇరవై మంది వర్కర్లు విధులు నిర్వహిస్తున్నామని కానీ తమ శ్రమకు తగ్గ ప్రతిఫలం లభించడం లేదన్నారు. పోలవరం, గోపాలపురం, చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గాల్లో పదిహేడు మండలాల్లో 242 గ్రామాలు, ఆవాసాల్లోని ఆరు లక్షల మందికి పైగా ప్రజలకు తాగునీరు సరఫరా అవుతుంది. జీతాల పెండింగ్‌తో పిల్లల చదువులకు విద్యా సామగ్రి కొనలేని పరిస్థితి నెలకొందని, విడతల వారీగా కట్టే స్కూల్ ఫీజులు చివరి దశలో ఉండగా యాజమాన్యాల ఒత్తిడి తీవ్రమైందన్నారు. సొంత గ్రామాలు వదిలి ఉద్యోగ నిమిత్తం ప్రజలకు అందుబాటులో ఉండే మారుమూల గ్రామాల్లో నివసించాల్సి వస్తుందన్నారు. ఎన్నికల ముందు కొయ్యలగూడెం మీదుగా సాగిన యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీలు గుప్పించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టును దత్తత తీసుకుంటానని, వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు.



హుకుంపేట వద్ద ఉన్న సత్యసాయి తాగునీటి వాటర్ ట్రీట్‌మెంట్ ట్యాంక్


గోదావరి నదిలో ఉన్న పంప్ హౌస్

తీరా అధికారంలోకి వచ్చిన తరువాత హామీపై యూనియన్ నాయకులు లోకేష్ దృష్టికి తీసుకెళ్లినా లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలల గడుస్తోందని, హామీలు మాట ఎలాగున్నా కనీసం వేతనాలు కూడా చెల్లించకుండా పోయిందన్నారు. 2006వ సంవత్సరంలో సత్యసాయి తాగునీటి పథకం ప్రారంభం కాగా ప్రస్తుతం తాము అనుభవిస్తున్న దుర్భర పరిస్థితులు ఎప్పుడూ గడపలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ వేతనాలు చెల్లించడంతో పాటు నారా లోకేష్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని కోరారు.

మరమ్మతులు మేమే చేస్తాం



లీకులు, పిట్టర్, ఎర్త్‌వర్క్, తదితర మరమ్మతులు మేమే చేస్తాం. అదనపు భారాన్ని కూడా మోయగలుగుతున్నాం. ఐతే పెండింగ్ బకాయిలతో పిల్లలకు పరీక్ష ఫీజులు కట్టలేకపోయాం. స్కూల్‌లో యాజమాన్యాన్ని యూనియన్ నాయకుల ద్వారా బతిమాలి వారి దయాదాక్షిణ్యాలపై పిల్లలు పరీక్షలకు హాజరయ్యే పరిస్థితి ఏర్పడింది.

– అంబటి శ్రీనివాసరావు, సత్యసాయి తాగునీటి పథకం లైన్‌మెన్

వేసవిలో మరింత శ్రమించాలి



వేసవిలో దాహార్తి సమస్యలు ఎక్కువగా ఉంటాయి. అదే సమయంలో మరమ్మతులు కూడా ఎక్కువగా ఉంటాయి. కావున ఈ సమయంలో మరింత శ్రమించాలి. ఇరవై ఏళ్ల నుంచి సరఫరాకు సంబంధించిన పరికరాలు ఉపయోగిస్తూ ఉండడంతో మరమ్మతులు తరచూ ఏర్పడుతున్నాయి. పాడుపడిన వాటితోనే కాలక్షేపం చేస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేయగలుగుతున్నాం.

– పిల్లి నాగ వీరబాబు, యూనియన్ ట్రెజరర్

ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ మల్లేశ్వరరావు

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ సామాజిక పరివర్తనకు కవితలు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులచే కవిత్వ పఠనం చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.ఉషారాణి, కె.ఇందిరా కుమారి, ధారావతు మల్లేష, పి.ఏడుకొండలు, ఎం.విజయకృష్ణ పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు వసతి కల్పించాలి

చింతలపూడి: విజయవాడ విమానాశ్రయం నుంచి హజ్ యాత్రికుల కోసం ఎంబార్కేషన్ వసతి కల్పించాలని జిల్లా ముస్లిం మైనారిటీ నాయకుడు ఎస్కే ఆజాద్‌బాబు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం చింతలపూడిలో ఆయన మాట్లాడుతూ ముస్లింలు హజ్ యాత్ర చేయడానికి విజయవాడ నుంచి సౌకర్యంగా ఉంటుందన్నారు. దీనిపై పౌర విమాన శాఖ సహాయ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించాలన్నారు.

నాటుసారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు


కుక్కునూరు: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది


కొయ్యలగూడెం: ప్రచార రథంతో ఎక్సైజ్ అధికారులు

కుక్కునూరు: ఏజెన్సీ పల్లెలను సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు నవోదయం 2.0లో ప్రత్యేక చర్యలు చేపట్టామని జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనుబాబు తెలిపారు. శుక్రవారం కుక్కునూరు మండలంలోని పలు గ్రామాలలో నవోదయం గ్రామ సభలను నిర్వహించారు. మండలంలో దాడులు నిర్వహించి 12 మంది సారా నిందితులను తహసీల్దార్ కోర్టులో హాజరుపరిచి రూ.లక్షకు బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై జి.వెంకటలక్ష్మి, ఎస్ఎన్ఎస్ సుబ్రహ్మణ్యం, వీఆర్వోలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి

కొయ్యలగూడెం: నాటుసారా నిర్మూలనకు ప్రజలు సహకరించాలని పోలవరం ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం అన్నారు. మండలంలోని మంగపతిదేవిపేట, కన్నాపురం, బోడిగూడెం, దిప్పకాయలపాడు, కొమ్ముగూడెం, మేతప్పకోట గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నవోదయం ప్రచార రథంతో నాటు సారా వల్ల కలిగే నష్టాలను తెలియజేస్తూ ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో నాటు సారా స్థావరాలను గుర్తించి ధ్వంసం చేయడంతో పాటు, నాటు సారా తయారీ, అమ్మకాలు, రవాణా చేసే వారిని బైండోవర్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సై జి.సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


వేలేరుపాడు: సారా నిందితులను బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

సారా నిందితుల బైండోవర్

వేలేరుపాడు: నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. నాటుసారా కేసుల్లో పట్టుబడిన నిందితులను తహసీల్దార్ కోర్టులో శుక్రవారం బైండోవర్ చేశారు. ఆయన మాట్లాడుతూ వేలేరుపాటు మండలంలో సారా తయారీ, అమ్మకాలు, అక్రమ మద్యం అమ్మకాల కేసుల్లో పట్టుబడిన ఏడుగురు నేరస్తులను తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేసినట్లు చెప్పారు. అలాగే వేలేరుపాడు మండలంలో గ్రామాల్లో సర్పంచ్‌లు, వీఆర్వోలు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లతో గ్రామ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీరితో ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించిన నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సైలు జి.వెంకటలక్ష్మి ఎన్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా మొక్కజొన్న ఎగుమతులు

లింగపాలెం: మెట్ట ప్రాంతమైన లింగపాలెం మండలంలో మొక్కజొన్న ఎగుమతులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో కమర్షల్ మొక్కజొన్న సాగును సుమారు 410 ఎకరాల్లో ఈ ఏడాది రైతులు అధికంగా సాగు చేశారు. పాప్‌కార్న్ మొక్కజొన్న పంటను సుమారు 749 ఎకరాల్లో సాగు చేశారు. 3,273 వేల ఎకరాల్లో సీడ్ మొక్కజొన్న పంటను రైతులు సాగుచేశారు. ఇంకా వివిధ రకాలకు చెందిన విత్తనాలను సాగు చేశారు. ఎండిన మొక్కజొన్న కండెలను ఆరపెట్టి ఫ్యాక్టరీలకు దీంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. మండలంలో 4 మొక్కజొన్న ఫ్యాక్టరీలు ఉండటంతో పాటు అధికంగా మొక్కజొన్న పంటను సాగు చేశారు. ప్రతి రోజూ మండలం నుంచి సుమారు 35 నుంచి 40 లారీలు, ట్రాక్టర్లలో ఎగుమతులు చేస్తున్నారు.


మొక్కజొన్న ఎగుమతులు చేస్తున్న రైతులు

నూకాలమ్మకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మకు శుక్రవారం సందర్భంగా అర్చకులు నిత్య పూజా కైంకర్యాలు, అభిషేకాలు, సాయం సంధ్యా హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూకాలమ్మ 61వ ఉగాది జాతర మహోత్సవాలు ఈ నెల 25వ తేదీన ప్రారంభం అవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆలయంలో జాతర మహోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ మార్చి 25వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే ఈ జాతర మహోత్సవాలు 25వ తేదీ ఉదయం 8 గంటలకు గ్రామ దేవత గంగానమ్మ ఆలయం నుంచి సుమారు వెయ్యిమంది మహిళలు కలశాలను ధరించి శోభాయాత్ర నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలోఆలయ కమిటీ సభ్యులు, శ్రీ నూకాంబిక సేవా బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కమిటీ చైర్మన్

లయన్స్ సేవలు విస్తరించాలి

చింతలపూడి: గ్రామీణ ప్రాంతాల్లో లయన్స్ సేవలు విస్తరించాల్సిన ఆవశ్యకత ఉందని లయన్స్ జిల్లా గవర్నర్ పీఎంజేఎఫ్ లయన్ కాకరాల వేణుబాబు అన్నారు. యర్రంపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.70 వేల విలువైన ఫ్రీజర్ బాక్స్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేణుబాబు మాట్లాడుతూ ఇలాంటి సదుపాయాలు గ్రామాలలో చాలా అవసరమని అన్నారు. కార్యక్రమంలో కాకరాల వేణుబాబు, విష్ణుకుమార్, వి.రామారావు, జంగా చెన్నకేశవ రెడ్డి, మాధవి, సునీత, జయమ్మ, జగ్గవరపు ముత్తారెడ్డి, శ్రీహరి రెడ్డి, గార్లపాటి నరసింహారావు, తుమ్మూరి వెంకట కృష్ణారెడ్డి, గోలి చంద్రశేఖర్ రెడ్డి, చిల్లపల్లి రామమోహనరావు, పవన్‌కుమార్, గాంధీ, సభ్యులు పాల్గొన్నారు.


ఫ్రీజర్ బాక్స్‌ను ప్రారంభిస్తున్న లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు

అడవికి రక్షణ.. అటవీ అధికారులు

జంగారెడ్డిగూడెం: దేశానికి సిపాయి రక్షకుడిగా ఉంటే అడవికి ఫారెస్టు అధికారులు రక్షణగా ఉంటారని ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు, చిన్ని సేవా ట్రస్టు చైర్మన్ చిన్ని రామసత్యనారాయణ (సీహెస్ఆర్) అన్నారు. స్థానిక సిటీ డిజిటల్ నెట్‌వర్క్ సిటీకేబుల్ కార్యాలయంలో ప్రపంచ అటవీ దినోత్సవం పురస్కరించుకుని సిటీకేబుల్ ఎండీ చిన్ని హరీష్ గుప్తా అధ్యక్షతన జంగారెడ్డిగూడెం అటవీశాఖాధికారులను, ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో చిన్ని సాయికుమార్, తుమ్మరాజు, రెడ్డి, తేజ, సాయి, నాగబాబు, బలరాం, అటవీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం

కొయ్యలగూడెం: ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాజవరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఆవరణలోని వృక్షాల చుట్టూ చేతులు కలిపి మానవహారం నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించగలిగిన ఏకైక మార్గం వృక్షాలను పెంచడమేనని తెలపటమే తమ ముఖ్య ఉద్దేశ్యమని విద్యార్థులు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, గుప్తా తదితరులు పాల్గొన్నారు.


కొయ్యలగూడెం: హైస్కూల్‌లో వృక్షాల చుట్టూ మానవహారం చేపట్టిన విద్యార్థులు


జంగారెడ్డిగూడెం: అటవీశాఖ అధికారులను సన్మానిస్తున్న చిన్ని ట్రస్టు ప్రతినిధులు

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

జంగారెడ్డిగూడెం: అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మండల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యుడు జి.సూర్యకిరణ్‌తో కలిసి జీవరత్నం మాట్లాడుతూ గత ఆరు రోజుల నుంచి గ్రామాల్లో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నామన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు. తొలుత సీపీఎం కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ స్లీవజోజికి అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ పి.సూర్యరావు, జోడే సూరిచంద్రరావు, అందుగుల ప్రభాకర్‌రావు, యాగంటి సీత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

చింతలపూడి: రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఇటీవల సీపీఎం ప్రజా చైతన్య యాత్రల ద్వారా ప్రజల నుంచి అనేక సమస్యలు సేకరించినట్లు మండల కన్వీనర్ పి.పాండు రంగారావు తెలిపారు. ధర్నా అనంతరం తహసీల్దార్ ప్రమద్వరకు వినతిపత్రం అందచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో దేవ గురు సత్యనారాయణ, ఎం.వరలక్ష్మీదేవి, ఆర్.ధర్మారావు, కె.అనురాధ, వాసు, గోపలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

తునికి చెట్లు నరికించాలి

జంగారెడ్డిగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో తునికి చెట్లు నరికించే చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక అటవీశాఖ కార్యాలయం వద్ద ధర్నా చేసి, కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. మాస్‌లైన్ జిల్లా కమిటీ నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఏటా ఫిబ్రవరిలో తునికి చెట్లు నరికిస్తున్నారన్నారు. అయితే ఈ ఏడాది మార్చి చివరికి వస్తున్నా నరికించలేదని వెంటనే నరికించాలన్నారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు

ద్వారకాతిరుమల: క్షేత్రంలోని మెడికల్ షాపుల్లో డ్రగ్, విజిలెన్స్, పోలీస్, ఔషధ నియంత్రణ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందుల కంపెనీలు, వాటి నాణ్యత, విక్రయిస్తున్న ధరల వివరాలను యజమానుల నుంచి రాబట్టారు. అలాగే మందుల కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న తనిఖీల్లో భాగంగా ఈ మెడికల్ షాపులను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.

30 నుంచి ఉగాది ఉత్సవాలు

పోలవరం రూరల్: గండిపోశమ్మ ఉత్సవాలు ఉగాది నుంచి ప్రారంభమవుతాయని ఆలయ నిర్వాహకులు ఎస్.వెంకన్న దొర పేర్కొన్నారు. అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం అఖండ గోదావరి నదీ తీరాన గొన్నూరు గ్రామంలో కొలువైన అమ్మవారి ఉత్సవాలు 5 రోజుల పాటు నిర్వహిస్తారు. మార్చి 30వ తేదీ ఉగాది నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు, అభిషేక అర్చనాది కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. దేవదాయ ధర్మదాయశాఖ పరిధిలో నిర్వహించే ఉత్సవాలకు పలువురు ప్రముఖులు హాజరవుతారు. పోలవరం నుంచి పురుషోత్తపట్నం నుంచి వెళ్లే రేవు లాంచీపై నిత్యం, సెలవు దినాల్లో భక్తులు ఈ ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకుంటారు.

విప్లవ వీరులకు జోహార్లు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వేలేరుపాడు: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన విప్లవ వీరులకు యువతరం ఎప్పటికీ రుణపడి ఉంటుందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్), అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నాయకులు అన్నారు. వేలేరుపాడులో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి బందం నాగేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యర్రా మధు మాట్లాడుతూ 23 సంవత్సరాల వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ఉరి కంభం ఎక్కిన విప్లవ వీరుల 94వ వర్ధంతి ఈ నెల 23వ తేదీన ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు కంగాల గంగరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఉల్లాస్ వయోజన విద్యా కేంద్రాల సందర్శన

ద్వారకాతిరుమల: ఉల్లాస్ వయోజన విద్య కేంద్రాలు మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని రాష్ట్ర టీసీఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) మేనేజర్ హఫీజ్ పేర్కొన్నారు. మండలంలోని సీహెచ్ పోతేపల్లి, జి.కొత్తపల్లి గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉల్లాస్ వయోజన విద్య కేంద్రాలను శుక్రవారం హఫీజ్ సందర్శించారు.

ఘనంగా ఇఫ్తార్ విందు

ద్వారకాతిరుమల: రంజాన్ పండుగ సందర్భంగా మండలంలోని దేవినేనివారిగూడెంలో అబూబక్కర్ సిద్దిక్ మసీదులో శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందును నిర్వహించారు. ఉపవాసాల విరమణను పురస్కరించుకుని ఈ విందును నిర్వహించారు. ఈ సందర్భంగా రంజాన్ ప్రార్థనల గురించి ఇమాం వివరించారు. కార్యక్రమంలో మేడికొండ దేవేందరరావు, షేక్ ఇస్మయిల్, మీరావలి, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం పరిశీలన

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షల తీరును తహసీల్దార్ పీవీ చలపతిరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన అన్ని సౌకర్యాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.